జగనన్న కాలనీలో వసతులపై నిర్లక్ష్యం

- ఇళ్లు నిర్మించుకునేందుకు ఇసుక కరువు
- రుణ సహాయం అందక లబ్ధిదారుల ఎదురు చూపు
- కాలనీల్లో ధ్వంసమైన రహదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


కుప్పనపూడి శివారు తాళ్లకోడులో ప్రభుత్వ సహాయంతో లబ్ధిదారులు నిర్మించుకున్న జగనన్న కాలనీ

ఆకివీడు: పేదల ఆశలు నీరుగారిపోతున్నాయి. ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం పోరాడిన నిరుపేదలకు ఇంటి స్థలం దక్కినా, కొంత మంది ఇళ్లు నిర్మించుకున్నా కష్టాలు మాత్రం వెన్నంటి ఉన్నాయి. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులో నిరుపేదల కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ పాతపాటి సర్రాజు పేదల కోసం 74 ఎకరాల భూమిని సేకరించి, సుమారు ఐదు అడుగుల ఎత్తు పూడ్చి ఇళ్ల స్థలాల లేఅవుట్ వేయించారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు పేదల లేఅవుట్‌ను పట్టించుకోలేదు. పేదలకు ఇచ్చిన పట్టాలు నిరుపయోగమయ్యాయి. పోరాటాల ఫలితంగా గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు చొరవతో పేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేశారు. మూడున్నర దశాబ్దాల పేదల పోరాటానికి మోక్షం లభించింది. మండలంలోని సుమారు 3,600 మంది పేదలకు ఇళ్ల పట్టాల్ని పండుగ వాతావరణంలో అందజేశారు. పేదల స్వంత ఇంటి కల నెరవేర్చేందుకు లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలు సహాయం అందజేశారు. డ్వాక్రా రుణం రూ.30 లక్షలు మంజూరు చేయించారు. రూ. 2.50 లక్షలతో చాలా మంది పేదల సొంత ఇంటి కల నెరవేరింది. స్తోమత ఉన్నవారు, అప్పు జేసి రూ. 6,రూ.8 లక్షలకు కూడా భవనాన్ని నిర్మించుకున్నారు. జిల్లాలోనే అతి పెద్ద లేఅవుట్‌గా ఉన్న తాళ్లకోడు జగనన్న కాలనీలో ప్రధాన రోడ్డు మూడింటిని నిర్మించారు. పలు వీధి రోడ్లు మట్టితో వేసి, గ్రావెల్ వేశారు. పేదల ఇళ్ల నిర్మాణం వేగంగా జరగడంతో సుమారు 1200 మంది పేదలు ఇళ్ల నిర్మాణాల్ని వేగంగా పూర్తి చేసుకున్నారు. మరో 700 మంది ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఇసుక దొరకక, ఆర్థిక స్థోమత లేక పునాదుల్లో నిలిచిపోయాయి. గత నాలుగు నెలల నుంచి వాతావరణం సహకరించక, ఆర్థిక స్థోమత లేక ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయాయి.

కొంత మేరకు మౌలిక సదుపాయాలు

గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు చొరవతో ప్రధాన రోడ్లను అభివృద్ధి చేశారు. ఇళ్ల నిర్మాణానికి నీటి సదుపాయం కల్పిస్తూ పైప్‌లైన్లు వేశారు. సుమారు 670 విద్యుత్ స్తంభాల్ని ఏర్పాటు చేసి, 50కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందజేశారు. ఇళ్లు నిర్మించుకున్న వారికి, నిర్మించుకుంటున్న వారికి ఉచిత కనెక్షన్లు మంజూరు చేశారు. ప్రభుత్వమే వైరింగ్, మీటర్, స్విచ్‌లు అందజేసింది. వీధిలైట్లతో కళకళలాడుతోంది. కచ్చా డ్రెయిన్లు తవ్వించి, వర్షపు ముంపు నీటిని బయటకు పోయే విధంగా చర్యలు తీసుకున్నారు. కాలనీలో వీధి రోడ్లు నిర్మించాల్సి ఉంది. డ్రెయినేజీ సౌకర్యం కల్పించాల్సి ఉంది. మంచినీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో 10 ఎకరాల భూమిని మంచినీటి కోసం కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారు.

అధ్వానంగా రోడ్లు

ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండటంతో ట్రాక్టర్లు, లారీలు తిరగడం వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం కాలనీలోని అన్ని వీధి రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు, గుంతలతో వాహనచోదకులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. వర్షం వస్తే కాలనీవాసులు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మంచినీటి సౌకర్యం లేదు. కాలనీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతోన్నాయి. కచ్చా డ్రెయిన్లు తవ్వించేనాథుడులేడని కాలనీవాసులు వాపోతున్నారు.

మా కాలనీ ఏ ప్రాంతానికి చెందినది

కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులో 74 ఎకరాల్లో సుమారు 3,600లకు పైగా ఇళ్లతో ఏర్పడుతోన్న కాలనీ పట్ల తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది. కాలనీ మా గ్రామానికి సంబంధించినది కాదని కుప్పనపూడి పంచాయతీ చెబుతుంటే, ఆకివీడు నగర పంచాయతీలోని అత్యధిక లబ్ధిదారులున్నందున నగర పంచాయతీకి చెందుతుందని పలువురు వాదిస్తున్నారు. అయితే నగర పంచాయతీ మాకు సంబంధంలేదని త్రోచిపుచ్చుతోంది. ప్రత్యేక గ్రామంగా ఏర్పడగలిగే సత్తా ఉన్న తాళ్లకోడు జగనన్న కాలనీ ఎవరిదీ కాకపోవడంతో సమస్యలు ఆప్రాంతంలో తాండవిస్తున్నాయి. నిరుపేదల కాలనీని పట్టించుకోవాలని వారు మొరపెడుతోన్నారు. మౌలిక వసతులు కల్పించాలని వేడుకొంటున్నారు. దిక్కులేని అనాథగా ఉన్న కాలనీకి ఆశ్రయం కల్పించాలని కోరుతున్నారు.

చినుకు పడితే అడుగు వేయలేం



చినుకు పడితే కాలనీ రోడ్లపై అడుగు వేయలేం. మంచినీటి సమస్యతో సతమతమవుతోన్నాము. బోరు నీరు, కాలవ నీటితో స్నానాలు కూడా చేయలేకపోతున్నాము. వీధి లైట్లు పూర్తిగా వెలగడంలేదు. డ్రైయినేజీ సౌకర్యం లేదు. లక్షలాది రూపాయలు అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నా కనీస వసతులు కల్పించడంలేదు. కాలనీ సమస్యలు ఎవరికి చెప్పాలో కూడా తెలియడంలేదు. అధికారులు, పాలకులు తమ వైపు చూడాలని కోరుతున్నాము.

–సాకా గోపి,లబ్ధిదారుడు, తాళ్లకోడు జగనన్న కాలనీ, ఆకివీడు మండలం.

ఘనంగా ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని పంచారామ క్షేత్రం శ్రీ ఉమా సోమేశ్వర జనార్దన స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ ఉమా సోమేశ్వర స్వామికి శనివారం తెల్లవారుజాము నుంచే రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోంబాబు రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి రామకృష్ణంరాజు, ఆలయ అధికారులు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

● ఆదివారం భారీగా తరలిరానున్న భక్తులు:
కార్తీకమాసం మొదటి ఆదివారం పంచారామ క్షేత్రానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో భక్తులు రద్దుకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు చేశారు.

భోళా శంకరుడికి అభిషేకాలు

ఆకివీడు: కార్తీక శోభతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. పలు శివాలయాల్లో తెల్లవారు జామునుంచే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాలకు ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్థానిక పిల్లలమర్రి అగ్రహారంలో వెంకట లింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన భీమేశ్వరస్వామి ఆలయంలోనూ, రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలోనూ, మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలోనూ, అయిభీమవరంలోని అమృతలింగేశ్వరస్వామి, కుప్పనపూడిలోని కుప్పేశ్వరస్వామి ఆలయంలోనూ, కాళింగగూడెంలోనూ, కోళ్లపర్రులోని కాశీవిశ్వేశ్వరస్వామి, ధర్మాపుర అగ్రహారంలోని పురాతన శివాలయంలో భోళా శంకరుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక పూజలు నిర్వహించారు.


భీమవరం (ప్రకాశం చౌక్): ఉమా సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు


ఆకివీడు: స్థానిక పిల్లలమర్రి అగ్రహారంలోని లింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

విద్యార్థినికి నగదు పురస్కారం

ఆకివీడు: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండల, జిల్లా స్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో స్థానిక విద్యా వికాస్ జూనియర్ ప్రైవేట్ కాలేజీ విద్యార్థిని లాభాల రాజ్యలక్ష్మి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకుంది. సైబర్ నేరాలపై అవగాహన అనే అంశంపై జిల్లా, మండల స్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో జిల్లా ప్రథమ బహుమతిని రాజ్యలక్ష్మి కైవశం చేసుకోగా ఆమెకు రూ. 2 వేలు నగదు, ప్రసంశా పత్రం, షీల్డ్‌ను జిల్లా పోలీస్ ఉన్నతాధికారి అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మిని స్కూల్ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన రాజ్యలక్ష్మికి నగదు పురస్కారం అందిస్తున్న దృశ్యం

అయిభీమవరంలో జ్వరాలు

- అల్లాడిపోతున్న బాధితులు
- వైద్యం పొందినా ఫలితం లేదని ఆవేదన


స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు

ఆకివీడు: అయిభీమవరం గ్రామంలోని విష జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జ్వరాలతో మంచం పట్టారు. వృద్ధులు, మహిళలే కాదు చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరం వచ్చి తగ్గిన తర్వాత ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, చర్మ వ్యాధులతో తల్లడిల్లిపోతున్నారు. కోవిడ్ తరహాలో జ్వరాలు విజృంభిస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లితే ఆ పరీక్షలు ఈ పరీక్షలకు అని వేలుకు వేలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. గ్రామంలో ప్రతి ఇంటిలోనూ ఒకరికి వస్తే ఇంట్లో అందరికీ వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు జ్వరపీడితులు మండల కేంద్రమైన ఆకివీడులోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. గత పది రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉందని సర్పంచ్ గాలి సామ్రాజ్యం చెప్పారు. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వరపీడితులున్నారన్నారు. జ్వరం తగ్గినా నీరసం, కీళ్ల నొప్పులు, మొఖం రంగు మారడం వంటివి జరుగుతున్నాయన్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసేందుకు వైద్యాధికారులకు చెబుతామన్నారు. మండల పీహెచ్‌సీ అధికారి దీనిపై మాట్లాడుతూ ఇంటింటా సర్వే చేసినప్పటికీ ఒకటి, రెండు మాత్రమే జ్వరం కేసులు వచ్చినట్లు సర్వే చేసిన ఏఎన్‌ఎంలు, ఆశాలు చెబుతున్నారన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. మళ్లీ సర్వే చేయిస్తామన్నారు.

చెస్ క్రీడాకారులకు అభినందనలు

భీమవరం: జాతీయ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో భీమవరం అనసూయ చెస్ అకాడమీ విద్యార్థులు అండర్–14 గరల్స్ అండ్ బాయ్స్, అండర్–17 బాయ్స్ విభాగాల్లో తృతీయ స్థానం సాధించిన దాట్ల భవిష్య, ఆముదాలపల్లి కార్తీక్, జుత్తిగ వరుణ్ తేజ్, నాళం వరుణ్ తేజ్‌లను ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు శనివారం అభినందించారు. అలాగే ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్ సాధించిన జాషిత్‌వర్మను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా భీమవరం పట్టణంలో అనసూయ చెస్ అకాడమీ కోచ్ మాదాస్ కిషోర్ శిక్షణలో ఎంతోమంది చదరంగం క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చదరంగం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, మైలాపురి మురళి, తోట ఫణిబాబు, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో చెస్ క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

భీమవరం: పర్యావరణాన్ని పరిరక్షించాలని యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ పి సంగీతకుమారి పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సందర్భంగా భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంగీతకుమారి మాట్లాడుతూ ప్రజలు, ఉద్యోగులు అవినీతి,లంచంపై పోరాడి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. విజిలెన్స్ వారోత్సవాలు భాగంగా మొక్కలు నాటడం, పిల్లలకు క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కస్తూరిభాయి మహిళా పాఠశాల, లూథరన్ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ విజిలెన్స్ అధికారి రమేష్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యనారాయణ, బ్యాంక్ చీఫ్ మేనేజర్స్ రమణ తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

అవినీతిని అంతం చేయడానికి ఏసీబీ వేగవంతం

భీమవరం: అవినీతిని అంతం చేయడంలో ఏసీబీ వేగవంతంగా పని చేస్తుందని ఉమ్మడి గోదావరి జిల్లాల ఏసీబీ సీఐ బాలకృష్ణ అన్నారు. భీమవరం కేజీఆర్‌ఎల్ డిగ్రీ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతి రహిత సమాజాన్ని నిర్మించుకుంటేనే దేశ ప్రగతి సాధ్యమన్నారు. వన్ టౌన్ సీఐ ఎం నాగరాజు మాట్లాడుతూ నీతి, నిజాయితీతో ప్రతి వ్యక్తి ముందుకు సాగితే అవినీతిని కూకటి వేళ్లతో అంతం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్, వడుపు గోపి, పుప్పాల శేషు, తోట రామ్మూర్తి, శ్రీరామచంద్రమూర్తి, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.


కేజీఆర్‌ఎల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

అన్నదానానికి బియ్యం అందజేత

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసం సందర్భంగా భీమవరం పంచారామ క్షేత్రమైన శ్రీ సోమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన నిమిత్తం 78 క్వింటాళ్ల బియ్యం బస్తాలను ఆలయ ఈవో కు ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అందజేశారు. ముందుగా స్వామివారికి, అమ్మవార్లకు గ్రంధి సునీల్, రవితేజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజు, ఆలయ ప్రధాన అర్చకులు కందుకూరి సోంబాబు, నల్లం రాంబాబు, నందమూరి ఆంజనేయులు, సమతం తాతాజీ, లీల, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పంచారామ క్షేత్రానికి బియ్యం అందజేస్తున్న గ్రంధి సునీల్, రవితేజ

గుంతల పూడిక పనులు ప్రారంభించిన ఇన్‌చార్జి మంత్రి

భీమవరం: రహదారులపై గుంతల పూడిక పనులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ప్రారంభించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు దారుణంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని చినఅమిరం కూడలిలో గుంతల మరమ్మతులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రోడ్లపై గుంతల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం పనులు ప్రారంభించిందని ఆయన చెప్పారు. వీటి నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా రూ.800 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో రూ.16.99 కోట్ల వ్యయంతో 74 రోడ్ల మరమ్మతులకు నేడు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. రానున్న వారం రోజుల్లో మరో రూ.31.25 కోట్ల వ్యయంతో మరో 114 రోడ్లకు మరమ్మతులు చేపట్టి సంక్రాంతి నాటికి పూర్తిచేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, అధికారులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభించిన మంత్రి రవికుమార్

మురుగు కాలువల అభివృద్ధికి చర్యలు

కాళ్ల: మురుగు కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు తెలిపారు. పెద అమీరం గ్రామంలో మురుగుకాలువ అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. మురుగు కాలువలు అభివృద్ధి చేయడం వల్ల రైతులకు ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న మురుగు కాలవ అభివృద్ధి పనులను చేస్తున్నట్లు డీఈ రుద్ర నరసింహ అప్పన్న తెలిపారు.

క్లుప్తంగా

వెంకన్నకు ఊంజల్ సేవ


ప్రత్యేక దీపాలంకరణలో స్వామి వారికి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం నందు కార్తీక శనివారం పర్వదినాన్ని పురస్కరించుని ఉదయం గం 10–00 లకు జువ్వలపాలెం మహిళా మండలి భక్తులచే నామసంకీర్తన(భజన) నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం శ్రీ స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. కార్తీకమాసం తొలి శనివారం పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి దేవాలయం భక్తుల గోవిందనామ స్మరణతో కిటకిటలాడినది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

యానాదుల ఇళ్లను తొలగించవద్దు


రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఉండి: మండలంలోని భవానీపేట యానాదుల కాలనీలో నివాసముంటున్న యానాదుల ఇళ్ల తొలగింపు చేయవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు తహసీల్దార్‌ను కోరారు. భవానీపేటలో రహదారిని అనుకుని జీవిస్తున్న యానాదుల ఇళ్లను తొలగించాలని కొందరు రైతులు చేసిన ఫిర్యాదుపై బాధితులతో కలసి సీపీఐ నాయకులు శనివారం తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత యానాదులతో పాటు సనపల శ్రీనివాస్, పతివాడ గణపతి, కోణాల గొలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మం పాటిస్తే మనల్ని అదే కాపాడుతుంది


ప్రవచనం చేస్తున్న గరికపాటి నరసింహారావు

భీమవరం (ప్రకాశంచౌక్): ధర్మం పాటిస్తే మనల్ని ఆ ధర్మమే కాపాడుతుందని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహరావు అన్నారు. భీమవరం స్థానిక ఆనంద ఫంక్షన్ హాల్‌లో దివంగత చేకూరి వెంకటసూర్య నారాయణరాజు విశ్రాంతి న్యాయమూర్తి (దేవుడు రాజు)98 వ జయంతి ఉత్సవాలు సందర్భంగా నిర్వహిస్తున్న ప్రవచనాలు రెండోరోజు కొనసాగాయి. చిన్ననాటి నుంచి నైతిక విలువలు తెలుసుకుంటూ పెరగాలని సూచించారు. రామాయణంలోని పలు అంశాలపై ఆయన చేసిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ యూ కే విశ్వనాథరాజు, కుటుంబ సభ్యులు, కంతేటి వెంకటరాజు, డీఎస్ చంద్రజీ, సంగీత విద్వాంసులు పైడిరాజు, ప్రభావతి, కలిదిండి గోపాల రాజు గారు, వబిలిశెట్టి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేయాలి


ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు, సర్పంచ్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు పెన్మెత్స.శిరీష విశ్వనాథరాజు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నెల వరకు వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమముల నందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సాధించిన ప్రగతిని అభివృద్ధి కమిటీ సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యాధికారి డా సరాబు సునీల్ ఆధ్వర్యంలో వైద్యధికారిని డాక్టర్ డి సునీత సిబ్బంది ఆసుపత్రి కమిటీ చైర్మన్ పెన్మెత్స శిరీష విశ్వనాథ్ రాజు, గ్రామ సర్పంచ్ బందా విజయ దంపతులను శాలువతో సత్కరించి మెమొంటో ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు వైద్య సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలి

నరసాపురం: జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ సూచించారు. డిసెంబర్ 14న జరగనున్న లోక్ అదాలత్ నిర్వహణపై శనివారం కోర్టుహాల్లో పోలీసు అధికారులతో జడ్జి శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, వాటిలో రాజీ పడదగిన కేసులు గుర్తించి ఇరు పక్షాలకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు.

5న ఎంపీడీవో కార్యాలయంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 5వ తేదిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి లోకమాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో అమరరాజా గ్రూప్, జగదీష్ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీల్లో మిషన్ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్వాలిటీ కంట్రోల్ వంటి విభాగలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. 18–35 ఏళ్ల వయస్సు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని,నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లోకమాన్ తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్: 94418 41622 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

పొంచి ఉన్న ముప్పు


మోగల్లులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని మోగల్లు ఎస్సీ ఏరియాలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో పెట్టడం వల్ల అక్కడి స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు కూడా అందే విధంగా ఉందని, పెద్దలు లేని సమయంలో ఆడుకుంటూ వెళ్లి తెలియకుండా దానిని ఎక్కడ ముట్టుకుంటారోనని భయపడుతున్నారు. కనీసం ఆ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎటువంటి రక్షణ చర్యలు ఏర్పాటు చేయక పోవడం గమనార్హం. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల ఏదైనా జరగరాని ప్రమాదం సంభవిస్తే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని అక్కడి వాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం సంభవించినప్పుడు కాకుండా ముందే జనావాసాల మధ్యనున్న ట్రాన్స్‌ఫార్మర్ ను వేరే చోటికి తరలించడం గాని లేదా ప్రజలకు ఎటువంటి ప్రమాదం సంభవించకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి తమ ప్రాణాలను కాపాడాలని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.